నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

24 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్ : ఈ నెల 24వ తేదీ నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణకు తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో జరుగుతున్న కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 24వ తేదీన ఉదయం 11 గంటలకు శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అదే రోజు బీఏసీ సమావేశమై అసెంబ్లీ ఎజెండాను ఖరారు చేయనున్నారు.

హైదరాబాద్ శుక్రవారం 17-9-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 43 పేజీలు:4 వెల: రూ.1/-

హుస్సేన్ సాగర్‌లో పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:హైదరాబాద్ లో గణేష్ నిమజ్జనానికి అడ్డంకులు తొలగిపోయాయి. గమజ్జనంపై తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. హుస్సేన్‌సాగర్ సహా అన్ని చెరువుల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసుకోవడానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హుస్సేన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనంపై ఆంక్షలు విధిస్తూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను జీహెచ్ఎంసీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టింది.

దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హిమాకోహ్లీలతో కూడిన ధర్మాసనం వాదనలు విన్నది. జీహెచ్ఎంసీ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఉత్సవాలు జరుగుతున్న సమయంలో హైకోర్టు ఆర్డర్ వచ్చిందని సోలిసిటర్ జనరల్ అన్నారు. విగ్రహాలు చాలా వరకు ఎత్తుగా ఉన్నాయని, అకస్మాత్తుగా ఉత్తర్వులను అమలు చేయడంతో అనేక ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఈ ఆర్డర్‌ను అమలు చేస్తామని తుషార్ మెహతా తెలిపారు. ఇప్పటికే హుస్సేన్ సాగర్ చుట్టూ క్రేన్‌లు ఏర్పాటు చేశామని కాలుష్యం జరగకుండా వెంట వెంటనే విగ్రహాలను తరలిస్తామని సోలిసిటర్ జనరల్ వివరించారు. నిమజ్జనంపై హైకోర్టు ఉత్తర్వులు చివరి నిమిషంలో వెలువడినందున ఈ సంవత్సరం అందులో కొన్ని మినహాయింపులు కోరుతున్నట్లు జీహెచ్ఎంసీ తరుపు న్యాయవాది ధర్మాసనానికి విన్నవించారు. హైకోర్టు ఉత్తర్వుల్లోని చాలా అంశాలకు తాము కట్టుబడి ఉంటామని, ఒకటి, రెండు అంశాలను మాత్రం తక్షణం అమలు చేయలేమని పేర్కొన్నారు.

దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసుకోవచ్చని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలు ఒక్క ఏడాదికి మాత్రమేనని, వచ్చే ఏడాది నుంచి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నిమజ్జనం చేయడానికి వీల్లేదని పేర్కొంది. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాల నిమజ్జనంతో హుస్సేన్‌సాగర్ కాలుష్యకారకంగా మారిపోయిందని, జల వనరులను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

కాగా, సుప్రీంకోర్టు తీర్పుతో హైదరాబాద్ లో గణేష్ నిమజ్జనానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. హుస్సేన్‌సాగర్ సహా అన్ని చెరువుల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనం జరగనున్నాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

చిన్నారి ఆత్మకు శాంతి చేకూరింది: మహిళా కమిషన్ చైర్మన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 16: సైదాబాద్ ఘటన నిందితుడు రాజు ఆత్మహత్యతో చిన్నారి ఆత్మకు శాంతి చేకూరిందని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. చిన్నారి ఆత్మగోశ రాజు మృతికి దారితీసిందని చెప్పారు. హత్యాచార ఘటనలు అత్యంత బాధాకరమని వెల్లడించారు. బాలికల్లో అవగాహన కోసం కార్యక్రమాలు చేపడతామన్నారు. హత్యాచార నిందితుడు రాజు ఆత్మహత్య చేసుకోవడంపై ఆమె పైవిధంగా స్పందించారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సైదాబాద్ చిన్నారి హత్యాచారం కేసు నిందితుడు రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లాలోని నష్కల్ రైల్వేట్రాక్‌పై రాజు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లిన రాజు సూసైడ్ చేసుకున్నట్లు లోకో పైలట్ పోలీసులకు తెలిపాడు. చేతి మీద ఉన్న మౌనిక అనే పచ్చబొట్టు ద్వారా పోలీసులు అతడిని రాజుగా గుర్తించారు.

గత ఏడు రోజుల నుంచి రాజు కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే.

ఈ నెల 9వ తేదీన సైదాబాద్‌లో చిన్నారిపై రాజు హత్యాచారం చేశాడు. నాటి నుంచి రాజు కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరంగా చేపట్టారు. నిందితుడిని పట్టుకునేందుకు 70 బృందాలను పోలీసులు రంగంలోకి దించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రాజు ఆచూకీ కోసం జల్లెడ పట్టారు. రాజు ఆచూకీ తెలిపిన వారికి రూ. 10 లక్షలు రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఆ పచ్చబొట్టుతోనే మృతదేహాన్ని గుర్తించాం: తెలంగాణ డీజీపీ

హైదరాబాద్ , సెప్టెంబర్ 16: ఆరేళ్ల చిన్నారి అత్యాచారం, హత్య కేసులో నిందితుడు .. వరంగల్ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్ పరిధిలో రైల్వే ట్రాక్‌పై శవమై తేలాడు. ఈ విషయాన్ని తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. ఇవాళ ఆయన తన ట్విట్టర్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. మృతుడి శరీరంపై ఉన్న పచ్చబొట్టు ద్వారా ఆ వ్యక్తి అత్యాచార నిందితుడిని గుర్తించినట్లు ఆయన తెలిపారు. మృతుడి చేతిపై మౌనిక అని పచ్చ బొట్టు రాసి ఉన్న గుర్తు ద్వారా అతన్ని రేప్ నిందితుడు రాజుగా తేల్చినట్లు డీజీపీ తన ట్వీట్‌లో చెప్పారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు : సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ తెలిపారు. ఈ నెల 19న ఆదివారం నిమజ్జన వేడుకలు జరుగనుండగా.. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరూర్‌నగర్, మన్సూరాబాద్, నాగోల్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇనాంగూడ, తుర్కయాంజల్, ఇంజాపూర్, జల్‌పల్లి, ఉప్పల్ నల్ల చెరువు, మల్కాజ్‌గిరి సఫీల్‌గూడ, కాప్రా చర్లపల్లి, చౌటుప్పల్ సంగమ్, భువనగిరి, బీబీనగర్ చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ వివరించారు.

రాజు డెడ్‌బాడీని ఎంజీఎంకు తరలిస్తాం : వరంగల్ సీపీ

వరంగల్, సెప్టెంబర్ 16:: హైదరాబాద్‌లోని సైదాబాద్ సింగరేణి కాలనీకి చెందిన చిన్నారి హత్యాచార కేసు నిందితుడు రాజు ఆత్మహత్య చేసుకున్న ప్రాంతానికి వరంగల్ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. పంచనామా అనంతరం వరంగల్ ఎంజీఎంకు రాజు డెడ్‌బాడీని తరలిస్తావన్నారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. గురువారం ఉదయం 9:58 గంటలకు కీమెన్ సారంగపాణి 100కు డయల్ చేశారు.

రాజారాం బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఎవరో ఆత్మహత్య చేసుకున్నారని తెలుపడంతో.. ఎస్ఐ రమేశ్ బృందం అక్కడికి చేరుకున్నారు. డెడ్‌బాడీపై ఉన్న పచ్చబొట్టు, ధరించిన దుస్తులను బట్టి రాజుగా నిర్ధారించారు అని సీపీ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్‌కు ఎలా వచ్చాడో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ మార్గానికి వచ్చే సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తామని సీపీ తరుణ్ జోపీ చెప్పారు.

సైదాబాద్ చిన్నారి హత్యాచార నిందితుడు రాజు ఆత్మహత్య

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:తెలంగాణలో సంచలనం రేపిన సైదాబాద్ సింగరేణి కాలనీ అత్యాచార ఘటనలో నిందితుడు రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ సమీపంలోని నిందితుడు రాజు ఆత్మహత్యకు పాల్పడినట్టుగా తెలుస్తోంది. రైల్వే ట్రాక్‌వద్ద రాజు మృతదేహం లభ్యమైంది. అయితే, మృతుడి చేతిపై టాటుతోపాటు చేతిపై మౌనిక అనే పచ్చబొట్టు ఆధారంగా మృతున్ని రాజుగా గుర్తించినట్టు సమాచారం.

హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో తోటిపిల్లలతో కలసి ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారికి సెప్టెంబర్ 9న చాక్లెట్ ఆశ చూపి తీసుకెళ్లి నిందితుడు రాజు అత్యాచారం చేసి హత్య సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కుటుంబసభ్యులు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బాధితులపై లాఠీచార్జీ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. చిన్నారి తల్లిదండ్రులు నల్లగొండ జిల్లా దేవరకొండ సమీప తండాకు చెందిన వాసులు కాగా.. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి సింగరేణి కాలనీలో నివసిస్తున్నారు. ఈ సమయంలోనే ఈ దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఇక ఈ ఘటనపై పలు సంఘాలు, సామాజిక వేత్తలు నిరసనలు తెలిపారు. నిందితుడిని ఎన్ కౌంటర్ చేయాలంటూ డిమాండ్ లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో నిందితుడు రాజు ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం.

పోలీసులు గాలింపు ముమ్మరం చేయడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రాజు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులకు చిక్కి ఎన్‌కౌంటర్ కావడం కంటే తనకు తానే ప్రాణాలు తీసుకోవడం మేలని ఆలోచించే రాజు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కాగా, ఆ మృతదేహం నిందితుడు రాజుదేనని నిర్ధారించామని, అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చామని తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. రాజు ఆత్మహత్య చేసుకున్న విషయంపై డీజీపీ తనకు సమాచారమిచ్చారని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

అదుపులోనే కరోనా.. కేబినెట్‌లో సీఎం కేసీఆర్‌కు వివరణ

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:రాష్ట్రంలో కరోనా వైరస్ అదుపులోనే ఉందని, అన్ని రకాల మందులు, ఆక్సిజన్, టెస్ట్ కిట్స్, వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వైద్యారోగ్య శాఖ అధికారులు వివరించారు. మంత్రివర్గ సమావేశంలో వైద్యారోగ్య శాఖపై సీఎం కేసీఆర్ చర్చించారు. మొదటగా కొవిడ్ పరిస్థితిపై చర్చించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కరోనా స్థితిగతులు, తీసుకుంటున్న చర్యలపై వైద్యాధికారులు కేబినెట్‌కు సమాచారం అందించారు. ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో కరోనా పరిస్థితి, నియంత్రణకు సంబంధించి సమాచారాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.

విద్యాసంస్థలు పునఃప్రారంభమైన అనంతర పరిస్థితులను కేబినెట్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖాధికారులు వివరించారు. స్కూళ్లు, కాలేజీలు తెరిచిన తరువాత కరోనా కేసులలో పెరుగుదల లేదని, కరోనా పూర్తిగా అదుపులో వుందని తెలిపారు. అన్నిరకాల మందులు, ఆక్సిజన్, టెస్ట్ కిట్స్, వాక్సినేషన్ అందుబాటులో వున్నాయని వివరించారు.

2 కోట్ల మందికి వ్యాక్సినేషన్ పూర్తి.. నేటి నుంచి స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్

2 కోట్ల మందికి వ్యాక్సినేషన్ పూర్తయిందని సీఎం కేసీఆర్‌కు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 2 కోట్ల 56 వేల 159 డోసులు అందించినట్లు చెప్పారు. స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ నేటి నుంచి ప్రారంభమైందని తెలిపారు. ప్రతి గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లోని పంచాయతి మున్సిపల్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసిలు, ఎంపీపీ, జడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధులు క్రీయాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మంత్రులందరూ ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ప్రతిరోజు 3 లక్షల వరకు టీకాలు వేసే విధంగా పూర్తి సన్నద్ధతతో వ్యవహరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కేబినెట్ నిర్దేశించింది. గతంలో 130 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యం మాత్రమే వుండేదని, దాన్ని ఇప్పటికే 280 మెట్రిక్ టన్నులకు పెంచుకున్నామని తెలిపారు.

వచ్చే ఏడాది నుంచి కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం

వచ్చే సంవత్సరం నుండి కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభించడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్ అండ్ బి, వైద్యారోగ్య శాఖను కేబినెట్ ఆదేశించింది. హైదరాబాద్‌లో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ ఏర్పాటుపై కెబినెట్ సమీక్షించింది. ఆసుపత్రుల నిర్మాణ ఏర్పాట్లపై సత్వరమే చర్యలు చేపట్టాలని, అత్యంత వేగంగా ఆసుపత్రుల నిర్మాణం జరగాలని కెబినెట్ ఆదేశించింది.

చిన్న పిల్లలకు కరోనా వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధం

ఒకవేళ చిన్నపిల్లలకు కరోనా వస్తే ఆ పరిస్థితులను ఎదర్కోవడానికి సిద్ధంగా వున్నామని వైద్యాధికారులు కేబినెట్‌కు వివరించారు. రూ. 133 కోట్ల ఖర్చుతో బెడ్స్, మందులు, ఇతర సామాగ్రిని సమకూర్చామని తెలిపారు. చిన్నపిల్లల వైద్యం కొరకు సంబంధించి 5200 బెడ్లు, ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఇప్పటికే సమకూర్చుకున్నామని వైద్యాధికారులు తెలిపారు. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో ఆరోగ్య మౌలిక వసతుల పురోభివృద్ధి కొరకు సమగ్రమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుని తదుపరి కేబినెట్ ముందుకు తీసుకురావాలని మంత్రి మండలి వైద్య శాఖాధికారులను ఆదేశించింది.

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ , సెప్టెంబర్ 16: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన పల్లా రాజేశ్వర్ రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేత మండలి ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమానికి మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్ అలి, శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవిత, వాణీదేవి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహా చార్యులు హాజరయ్యారు.

గుజరాత్‌లో 24 మంది మంత్రుల ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: గుజరాత్ కొత్త కేబినెట్ కొలువుదీరింది. మాజీ అసెంబ్లీ స్పీకర్ రాజేంద్ర త్రివేది, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు జితు వాఘని సహా 24 మంది మంత్రులుగా గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ 24 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. గత ముఖ్యమంత్రి విజయ్ రూపానీ నేతృత్వంలోని ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన ఏ ఒక్కరికీ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేబినెట్‌లో చోటివ్వలేదు. గవర్నర్ 10 మంది కేబినెట్ మంత్రులు, 14 మంది రాష్ట్ర మంత్రులతో ప్రమాణం చేయించారు. ఇందులో ఐదుగురు స్వతంత్ర బాధ్యతలు కలిగిన మంత్రులు ఉన్నారు. కేబినెట్ మంత్రులు బాధ్యతలు స్వీకరించిన వారిలో రాజేంద్ర త్రివేది, జీతు వాఘని, రుషికేష్ పటేల్, పూర్ణేష్ మోడీ, రాఘవ్‌జీ పటేల్, కనుభాయ్ దేశాయ్, కిరిత్సింహ్ రాణా, నరేశ్ పటేల్, ప్రదీప్ పర్మార్, అర్జున్‌సింగ్ చౌహాన్ ఉన్నారు. కార్యక్రమానికి సీఎం భూపేంద్ర పటేల్ హాజరయ్యారు.

సెంట్రల్ విస్టా ప్రాజెక్టు విమర్శకులపై మోదీ ఫైర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా నిర్మించిన రక్షణశాఖ ఆఫీసులను ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త పార్లమెంట్ భవన నిర్మాణం కోసం చేపడుతున్న సెంట్రల్ విస్టా ప్రాజెక్టును విమర్శిస్తున్న వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు కేవలం పర్సనల్ ఎజెండా కోసమే జాగ్రత్తపడుతున్నాయని ఆరోపించారు. కీలక ప్రభుత్వ ఆఫీసులు, మంత్రిత్వ కార్యాలయాలు ఎలా ఉన్నాయో ప్రతిపక్షాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. సుమారు 20 వేల కోట్లతో సెంట్రల్ విస్టా ప్రాజెక్టును చేపడుతున్న విషయం తెలిసిందే. సెంట్రల్ విస్టా కింద కొత్త పార్లమెంట్ భవనంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆఫీసులను నిర్మించనున్నారు.

సెంట్రల్ విస్టా ప్రాజెక్టును అడ్డుకునేందుకు కొందరు ఎలా ప్రవర్తించారో తెలుసు అని, స్వలాభం కోసం తప్పుడు సమాచారాన్ని చేరవేశారని, కానీ వాళ్లు ఎప్పుడూ ప్రభుత్వ కార్యాలయాల దీనస్థితి గురించి మాట్లాడలేదని, మంత్రులు పనిచేసే ఆఫీసులు ఎలా ఉన్నాయో పట్టించుకోలేదని, రక్షణశాఖ కాంప్లెక్స్ గురించి వాళ్లు ఎన్నడూ పెదవి విప్పలేదని ప్రధాని మోదీ విమర్శించారు. రక్షణశాఖ ఆఫీసు గురించి ప్రతిపక్షాలు మాట్లాడి ఉంటే, వాళ్లు చెప్పే అబద్దాలు బయటపడేవని మోదీ అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సెంట్రల్ విస్టా ప్రాజెక్టును తప్పుపట్టిన విషయం తెలిసిందే. కొత్త పార్లమెంట్ భవన నిర్మాణాన్ని నిర్ణీత సమయం లోపే పూర్తి చేస్తామని ప్రధాని తెలిపారు.

చరిత్రలో నేటినిజం



టెక్నాలజీ ఆధారిత పాలనకు తెలంగాణ ఆదర్శం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , సెప్టెంబర్ 16:ఐటీ అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మాత్రమే కాదని.. ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అని మంత్రి కేటీఆర్ అన్నారు. స్టార్టప్‌లు, పెట్టుబడులకు తెలంగాణ మొదటి చాయిస్‌గా మారిందని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రెండో ఐటీ పాలసీని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏ టెక్నాలజీ అయినా సామాన్య ప్రజల అవసరాలను తీర్చేలా ఉండాలని సీఎం కేసీఆర్ చెప్తుంటారని వెల్లడించారు. టెక్నాలజీ ఆధారిత పాలనకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ కూడా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

రెట్టింపైన ఆదాయం..

తెలంగాణలో తలసరి ఆదాయం ఏడేండ్లలో దాదాపు రెట్టింపయిందని చెప్పారు. తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్రంలో ఎక్కువగా ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటికంటే ఐటీ ఎగుమతులు రెండింతలు అయ్యాయని వెల్లడించారు. 2013-14లో రూ.57 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు.. 2020-21 నాటికి రూ.లక్షా 45 వేల కోట్లకు పెరిగాయని చెప్పారు. ప్రపంచంలో అత్యున్నత ఐదు కంపెనీలు హైదరాబాద్‌లో తమ ఆఫీస్‌లను ఏర్పాటు చేశాయన్నారు. అనేక అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

ఐదు లక్షల మందికి ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్ రంగంలో ఐదు లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు వచ్చాయని మంత్రి చెప్పారు. 15 వందల స్టార్టప్‌లకు సహాయం అందించామని, టాస్క్ ద్వారా మూడు లక్షల మందికి పైగా నిపుణులను తయారు చేశామన్నారు. ఐదు వందలకు పైగా ప్రభుత్వ సేవలు మీ సేవ ద్వారా అందిస్తున్నామని వెల్లడించారు. స్మార్ట్ గవర్నమెంట్ విభాగంలో తెలంగాణ జాతీయ అవార్డులు గెలుచుకుందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లోని 5 లక్షల మందికిపైగా డిజిటల్ ఎడ్యుకేషన్ అందించామన్నారు. ప్రైవేటు కంపెనీలతో కలిసి రూ.13 వందల కోట్లతో స్టార్టప్‌లను పోత్సహిస్తున్నామన్నారు. ప్రధాన ఐటీ కంపెనీలు రాష్ట్రంలోని టైర్-1, టైర్-2 సిటీలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో 40 స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో నాస్కామ్ చైర్మన్ రేఖ మీనన్, ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పాల్గొన్నారు. నూతన ఐటీ పాలసీ 2026 వరకు అమల్లో ఉండనుంది.

ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన - ఏడేండ్ల ప్రగతి

(ప్రధానమంత్రి జన్ ధన్ యోజన'కు ఏడేళ్ళు పూర్తి అయిన సందర్భంగా)

దేశ అసంఘటిత వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి ఒక జీరో-బ్యాలెన్స్ బ్యాంకు ఖాతా (అకౌంట్) సదుపాయాన్ని కల్పిస్తూ, అణగారిన వర్గాల్లో ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక సేవలు, రూ. 10,000 వరకు రుణ సదుపాయాలు, ప్రమాద భీమ (ఒక లక్ష రూపాయలు), పెన్షన్, బ్యాలెన్స్‌కు వడ్డీ చెల్లింపులు, పొదుపును ప్రోత్సహించడం, రూపీ డెబిట్ కార్డ్ సౌకర్యం లాంటి విలక్షణ సేవలు అందించే ప్రధాన లక్ష్యాలతో 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పియంజెడివై)' తొలి దశ పథకాన్ని 28 ఆగష్టు 2014న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పియంజెడివై పథకం ప్రవేశ పెట్టిన తొలి వారంలోనే దేశవ్యాప్తంగా 18, 096,130 బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేసి గిన్నీస్ వరల్డ్ రికార్డ్‌ను కూడా నెలకొల్పడం జరిగింది. మార్చి 2015 వరకు 14.72 కోట్ల ఖాతాలు (అకౌంట్లు ఖాతాల్లో రూ. 22,901 కోట్లు) ఉండగా, గత 7-ఏళ్ళలో మూడు రెట్లు పెరిగి ఆగష్టు 2021లో 43.04 కోట్ల అకౌంట్లు (ఖాతాల్లో రూ. 1,46,230 కోట్ల నగదు) ఆపరేషన్‌లోకి వచ్చాయి. ఈ విశ్లేషణలన్నీ జన్ ధన్ యోజన పథక ప్రాముఖ్యతను, ప్రాచుర్యాన్ని, సఫలతను తేటతెల్లం చేస్తున్నాయి. జన్ ధన్ యోజన ఖాతాల్లో 67 శాతం గ్రామీణ ప్రాంత ప్రజలకు, 55 శాతం మహిళల ఖాతాలు ఉండడం విశేషంగా పేర్కొనవచ్చు. ఒక్క ఒడిసా రాష్ట్రంలోనే 1.76 కోట్ల లబ్ధిదారులకు 1.38 కోట్ల రూపీ కార్డులను జారీ చేశారు. వీరిలో 79 శాతం గ్రామీణ బడుగు బలహీన వర్గాల ప్రజానీకం ఉండడంతో పథకం పేదలకు అక్షయపాత్రగా నిలుస్తున్నదని తెలుస్తున్నది. అభివృద్ధికి ఆమెడ దూరంలో ఉన్న నిమ్నవర్గాలను చేర దీయడంలో, ఆర్థిక చేయూతను ఇవ్వడంలో పియంజెడివై విజయవంతమైంది. జన్ ధన్ యోజన ఆన్‌లైన్ ఖాతాతో నగదు మంజూరులో అక్రమాలు, సబ్సిడీల వితరణలో లీకేజీలు లాంటి అవలక్షణాలు అరికట్టబడ్డాయి.

కేంద్ర ప్రభుత్వం 2018లో మరింత మెరుగైన సేవల విస్తరణలతో 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన 2.0'ను ప్రారంభించింది. ఈ పథకం 2.0 ద్వారా యువజనులు ప్రతి ఒక్కరికీ (పియంజెడివై 1.0లో సూచించిన కుటుంబానికి ఒక ఖాతాకు బదులు) బ్యాంక్ ఖాతా ఉండేలా పథక రచన చేశారు. ప్రమాద భీమా విలువను 1 లక్ష నుంచి 2 లక్షల రూలకు, రుణ సదుపాయాన్ని 10,000/- నుంచి 20,000/-లకు (బేషరతు 2,000/- ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం) పెంచడం జరిగింది.

పేదలు, వనజనులు, సమాజానికి దూరంగా బతుకులు ఈడుస్తున్న నిర్భాగ్యులను కూడా ఈ పథకంలో భాగస్వాములను చేస్తూ ఆర్థిక బలాన్ని కల్పిస్తున్నాయి. నేడు జన్ ధన్ ఖాతాల్లో సగటున 3,000/- నుంచి 3,500/- వరకు నగదు నిల్వలు నమోదైనాయి. పియంజెడివై పథకంతో 2014లో 53 శాతం అల్పాదాయ వర్గాల ఖాతాలు ఉండగా, నేడు 80 శాతం వరకు ఖాతాలను కలిగి ఉన్నారు. జన్ ధన్ ఖాతాలను సమయానుకూలంగా వాడుకోవడం కూడా అత్యంత ప్రధానమైన అంశమని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. నేడు 5.82 కోట్ల ఖాతాలు (13 శాతం) ఆపరేషన్‌లో ఉన్నాయని ప్రభుత్వం తెలియజేస్తున్నది. ఒక బ్యాంకు ఖాతాను 2 ఏండ్లు ఆపరేట్ చేయని యెడల ఆ ఖాతాను ఆపరేషన్‌లో లేని ఖాతాగా పరిగణిస్తారని ఆర్‌బిఐ వివరిస్తున్నది. కరోనా విపత్తుతో జన్ ధన్ ఖాతా వాడకం, ఆర్థిక వనరులు, ఆదాయాలు, నగదు బదిలీ లాంటివి తగ్గడం గమనించారు. గ్రామీణులకు డిజిటల్ ఆపరేషన్ పట్ల అవగాహన కల్పించడం, అంతర్జాల/స్మార్ట్ ఫోన్ సౌకర్యం కల్పించడం పెద్ద సవాళుగా నిలుస్తున్నది. గ్రామీణ నిరుపేదల ఆర్థిక ఉద్ధరణ జరిగితేనే సమాజంలో అసమానతలు తగ్గించబడి సమన్యాయం, సమగ్రాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. ఈ ప్రధాన లక్ష్యాలను అధిగమించడంలో పియంజెడివై పథకం ఉత్తమ ఉత్ప్రేరకంగా నిలవాలని, అల్పాదాయ వర్గాల్లో ఆర్థిక అక్షరాస్యత సిద్ధించాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

'భారతదేశంలో పట్టణ ప్రణాళిక సామర్థ్యంలో సంస్కరణలు' అనే అంశంపై నితీ ఆయోగ్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:'భారతదేశంలో పట్టణ ప్రణాళిక సామర్థ్యంలో సంస్కరణలు' అనే అంశంపై నితీ ఆయోగ్ రేపు (16 సెప్టెంబర్‌న) నివేదికను విడుదల చేయనుంది. నితీ ఆయోగ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ కుమార్, కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్‌లు నితీ ఆయోగ్ సీఈఓ శ్రీ అమితాబ్ కాంత్, ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ కె. రాజేశ్వరరావు, సంబంధిత లైన్ మంత్రిత్వ శాఖల కార్యదర్శుల సమక్షంలో నివేదికను విడుదల చేయనున్నారు. నితీ ఆయోగ్ అక్టోబర్ 2020 నెలలో 'భారతదేశంలో పట్టణ ప్రణాళిక విద్యలో సంస్కరణలు' అనే అంశంపై ఒక సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ విషయమై కసరత్తు చేసిన కమిటీ తన నివేదికను రూపొందించడం ద్వారా తన పనిని ముగించింది. ఈ నివేదిక పట్టణ ప్రణాళికలోని వివిధ అంశాలపై సిఫారసులతో కూడిన సమితిని కలిగి ఉంది-ఆరోగ్యకరమైన నగరాల ప్రణాళికలో జోక్యం చేసుకోవడం, పట్టణ భూభాగం యొక్క అత్యుత్తమ వినియోగం, మానవ వనరుల సామర్థ్యాలను పెంచడం, పట్టణ పాలనను బలోపేతం చేయడం, స్థానిక నాయకత్వాన్ని పెంపొందించడం, ప్రైవేట్ రంగం పాత్రను పెంచడం వంటివి మరియు పట్టణ ప్రణాళిక విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ఈ నివేదిక తన నివేదికను విడుదల చేయనుంది.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరిగించాలి..!

సంగారెడ్డి సెప్టెంబర్ 16 (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ విమోచన దినోత్సవని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాడు సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నరేందర్ రెడ్డి, బిజెపి సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ రాజేశ్వర్ దేశ్పాండే , బిజెపి రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్ , తదితర బిజెపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నరు.

చదివేది బీటెక్.. చేసేది డ్రగ్స్ దందా

గుంటూరు, సెప్టెంబర్ 16:: గుంటూరు శివారు గడ్డిపాడు ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద పెదకాకాని పోలీసులు నిర్వహించిన సోదాల్లో సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ నిందితుల వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. మత్తు మందు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

ఈ ముగ్గురు నిందితులు బీటెక్ చదువుతున్నారు. వీరి నుంచి 25 ట్రమడాల్ మాత్రలు, 25 గ్రాముల ఎల్ఎస్‌డీ వ్రాపర్స్, 7 గ్రాముల ఎండీఎంఏ మత్తు మందులతో పాటు రూ.24,500 నగదును స్వాధీనం చేస్తుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా సింథటిక్ మత్తు మందు తెప్పించుకొని విక్రయాలు జరుపుతున్నారని ఎస్పీ వివరించారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందో అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి తొలి వెయ్యి రోజుల సమతుల్య ఆహారమే కీలకం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనానికి, శారీరక, మానసిక ఎదుగుదలకు పుట్టిన తొలినాళ్లలో మొదటి వెయ్యి రోజులలో తీసుకునే సమతుల పోషకాహారమే ఎంతో కీలకమని భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) - జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ ఐ ఎన్) శాస్త్రవేత్త డాక్టర్ జి.ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. సెప్టెంబరు నెలలో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ విభాగాలైన పత్రికా సమాచార కార్యాలయం, రీజనల్ అవుట్‌రీచ్ బ్యూరో బుధవారం సమతుల ఆహారం నుంచి సమతుల పోషకాహారం అనే అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. పత్రికా సమాచార కార్యాలయం సంచాలకులు శృతిపాటిల్ ప్రారంభోపన్యాసం చేస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా సెప్టెంబరు నెలలో పోషణ మాసోత్సవాలను 2018లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారని తెలిపారు. గర్భిణీ మహిళలు, బాలింతలు, బాలబాలికలకు పోషకాహారం వృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం ఆరంభించినట్లు తెలిపారు. అనంతరం ఎన్ఐఎన్ శాస్త్రవేత్త జి.ఎం.సుబ్బారావు మాట్లాడుతూ గర్భంలో పిండ దశ మొదలై తల్లిగర్భంలో 270 రోజులు ఎటువంటి లోపాలు తలెత్తకుండా శిశువు ఎదుగుదలతోపాటు పుట్టిన తర్వాత తొలి రెండేళ్లు(730 రోజులు) పిల్లలలో రోగ నిరోధక శక్తికి, అనంతరం ఎదుగుదలకు ఎంతో కీలకమని, అనంతరం ఆరోగ్యంగా జీవితకాలం పాటు గడపడానికి కూడా ఈ 1000 రోజుల పోషణనే తోడ్పాటు అందిస్తుందని వివరించారు. ఇప్పటికీ 30-40శాతం మహిళలలో సూక్ష్మ పోషకాలు, బి12, ఐరన్, ఫోలిక్‌యాసిడ్ లోపాలు ఉంటున్నట్లు గుర్తించామన్నారు. ఈ లోపాల నుంచి బయటపడేందుకు విభిన్న ఆహార పదార్థాలను తగినంత మోతాదులో ప్రతి రోజూ తీసుకోవాలని సూచించారు. గర్భిణీ మహిళ ప్రతి కిలో బరువు పెరుగుదలకు గర్భంలోని శిశువు 52 గ్రాముల చొప్పున పెరుగుతుందని తెలిపారు.

బలమైన ఆరోగ్యం, తిరుగులేని రోగ నిరోధక శక్తిని అందించడానికి బిడ్డ పుట్టిన మొదటి గంటలోపు తల్లి నుంచి శిశువుకు ముర్రుపాలు పట్టించాలని కోరారు. బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరునెలలపాటు తల్లిపాలు తప్పకుండా ఇవ్వడం ద్వారా పిల్లలలో మానసిక, శారీరక పెరుగుదలతోపాటు సాంక్రమిక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వెల్లడించారు. సరైన మోతాదులో సరైన సమయంలో నాణ్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని చెప్పారు. తాజా పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, కొవ్వు పదార్థాలు తగిన మోతాదులో ప్రతి రోజూ తీసుకోవాలని కోరారు. ప్రతి రోజూ ఆహారంగా 350 గ్రాముల కూరగాయలు, 150 గ్రాములు తాజా పండ్లుతోపాటు 5గ్రాములకు తక్కువగా ఉప్పు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలను నిల్వచేసుకొని తిరిగి వాడుకోవాలనుకుంటే 5 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలో నిల్వచేసుకోని మాత్రమే వాడుకోవాలని పేర్కొన్నారు. బియ్యం మరీ ఎక్కువగా కడిగితే అందులో ఉన్న సూక్ష్మ పోషకాలు కోల్పోతాయని చెప్పారు. వంటల కోసం రెండు లేదా మూడు రకాల వంట నూనెలు మార్చుతూ వాడుకోవాలని సూచించారు.

ఈ వెబినార్‌లో కేంద్ర సమాచార, ప్రసారమంత్రిత్వశాఖ అధికారులు, సిబ్బందితోపాటు తెలంగాణ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ...!

-అందరి సహకారంతో వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తిచేయాలి.

-జిల్లా కలెక్టర్లకు సూచించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్

సంగారెడ్డి, సెప్టెంబర్ 16(నేటినిజం ప్రతినిధి) బుధవారం హైదరాబాద్ నుండి ఆయన జిల్లా కలెక్టర్లు ,జెడ్పి చైర్మెన్లు, అదనపు కలెక్టర్లు ,జడ్పీ సీఈఓ లు ,మున్సిపల్ కమిషనర్ లు ,జిల్లా పంచాయతీ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ అందరి సహకారంతో వంద శాతం విజయవంతం చేయాలని ఆయన కోరారు.రోజుకు మూడు లక్షల మందికి టీకా వేయడం లక్ష్యంగా ఉందన్నారు. హ్యాబిటేషన్ వారీగా మరియు పట్టణ ప్రాంతాల్లో వార్డు వారీగా వ్యాక్సినేషన్ పూర్తిచేసి డిక్లరేషన్ చేయాలన్నారు. డిఎంఅండ్హెచ్ఓ లు పూర్తిస్థాయిలో ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని సూచించారు.

వ్యాక్సినేషన్ పూర్తయిన ఇళ్లకు స్టిక్కర్లు వేయాలని సూచించారు. ఒక ఉద్యమంలా వ్యాక్సినేషన్ జరగాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరిని భాగస్వాములను చేయాలని సూచించారు.

రాష్ట్రంలో రెండు కోట్ల కు పైగా ప్రజలకు వాక్సినేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. వ్యాక్సినేషన్ చాలా చక్కగా పూర్తి చేశారని, ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నానని ఆయన అన్నారు. రాష్ట్రం లో కోవిడ్ ను అరికట్టడం లోనూ వైద్య ఆరోగ్య శాఖ , ఆయా శాఖలు అప్రమత్తంగా పని చేశాయన్నారు.

జిల్లా కలెక్టర్ హనుమంతరావు జిల్లాలో రేపటి నుండి ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు ప్రధాన కార్యదర్శి కి తెలిపారు.

జిల్లాలో జూలై 1 నుండి ఇప్పటి వరకు 41,367 రాపిడ్ టెస్టులు, 8158 ఆర్ టి పి సి ఆర్ టెస్టులను చేశామని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 40 ప్రభుత్వ వాక్సినేషన్ సెంటర్లు ఉన్నాయని, వ్యాక్సినేషన్ కు 14.5 లక్షల మంది జనాభా అర్హులు కాగా, ఇప్పటివరకు 5,75,444 మందికి వాక్సినేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. జులై నుండి సెప్టెంబర్ 14 వరకు 2,67,900 మందికి టీకా ఇవ్వడం జరిగిందని వివరించారు.60 సంవత్సరాలు పైబడిన 69,353 మందికి, 45 సంవత్సరాలు పైబడిన 1,99,112 మందికి, 18 సంవత్సరాలు పైబడిన 2,77,187 మందికి వాక్సినేషన్ వేసామని తెలిపారు.

4,19,297 మందికి ఒక డోసు, 1,56,147 మందికి రెండు డోసులు పూర్తయ్యాయని సి ఎస్ కు తెలిపారు.

జిల్లాలో ఆరు ఆక్సిజన్ ప్లాంట్స్ ఉన్నాయని, సంగారెడ్డి జిల్లా ఆసుపత్రి, పటాన్చెరు, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రులు, మిర్జాపూర్ పీహెచ్సీలో ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని త్వరలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పూర్తిస్థాయిలో వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆవాస ప్రాంతం, మున్సిపల్ పరిధిలో ఇంటింటికి వెళ్లి వ్యాక్సినేషన్ పూర్తయిన ఇంటికి స్టి క్కర్ వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అందరి సహకారంతో స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ను విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా నుండి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు.

జిల్లా నుండి జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ, అదనపు కలెక్టర్ రాజర్షి షా, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఎంఅండ్హెచ్ఓ గాయత్రి దేవి, డిపిఓ సురేష్ మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు : ఎమ్మెల్యే ముఠాగోపాల్

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని, వారికే పార్టీ కమిటీల్లో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ కమిటీ విస్తృతస్థాయి సమావేశం బుధవారం డివిజన్‌లోని టీఆర్‌టీ గ్రౌండ్స్?లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడానికి కమిటీలు నియమిస్తామని తెలిపారు.

బస్తీ కమిటీల నియమాకల్లో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. బస్తీ కమిటీలో 11 మందికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కమిటీల్లో 52 శాతం బీసీ ఎస్సీ,ఎస్టీ మహిళా, మైనార్టీలకు అవకాశం కల్పిస్తామన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, ముఠా నరేశ్, యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ కమిటీ పరిశీలకులు బల్వీర్ సింగ్,మల్లికార్జున్ రెడ్డి, కో-ఆర్డినేటర్లు జి.పరుశురామ్ ముదిరాజ్, ఎం.వి అశోక్, పాశం రవి, మాజీ కార్పొరేటర్ ఎం.పద్మ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మొసలి.. అరగంట నిలిచిన రాజధాని ఎక్స్‌ప్రెస్

అహ్మదాబాద్, సెప్టెంబర్ 16:: రైలు పట్టాలపై ఒక మొసలి గాయపడి ఉండటాన్ని రైల్వే సిబ్బంది గమనించి స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో దానిని కాపాడేందుకు ఆ మార్గంలో ప్రయాణించే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను సుమారు అరగంట నిలిపివేశారు. గుజరాత్‌లోని వడోదర సమీపంలో ఈ ఘటన జరిగింది. వడోదర-ముంబై మార్గంలోని కర్జన్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పట్టాలపై రైలు ఢీకొని గాయపడిన మొసలిని ట్రాక్ తనిఖీ సిబ్బంది మంగళవారం ఉదయం గమనించారు. ఈ విషయాన్ని కర్జన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు చెప్పారు. దీంతో ఆయన వన్యప్రాణుల సంరక్షణ సిబ్బందికి ఫోన్ చేశారు.కాగా, ఆ సిబ్బంది వాహనంలో ఆ స్పాట్‌కు చేరేందుకు మార్గం లేదు. దీంతో వారు స్టేషన్‌కు వచ్చే వరకు వడోదర-ముంబై రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను కర్జన్ రైల్వే స్టేషన్‌లో నిలిపి ఉంచారు. దీంతో ఆ సిబ్బంది రైలు ఎక్కి సంఘటనా స్థలానికి వెళ్లారు. పట్టాల మధ్యలో తలకు గాయమైన మొసలిని గమనించారు. దానిని పట్టాల పక్కకు చేర్చగా అక్కడ మరో ఐదు నిమిషాలు నిలిచిన రాజధాని ఎక్స్‌ప్రెస్ ముందుకు కదిలింది.మరోవైపు ఎనిమిది అడుగుల పొడవైన ఆ మొసలి అనంతరం కొంతసేపటికే చనిపోయినట్లు వణ్యప్రాణుల సంరక్షణ కార్యకర్తలు హేమంత్, నేహా తెలిపారు. మరణించిన ఆ భారీ మొసలిని ఆ తర్వాత కిసాన్ రైలులో తరలించి కర్జన్ అటవీశాఖకు అప్పగించినట్లు స్టేషన్ సూపరింటెండెంట్ సంతోష్ శర్మ చెప్పారు. మరోవైపు ఈ ఘటన వల్ల ఆ మార్గంలో ప్రయాణించే రాజధాని ఎక్స్‌ప్రెస్ సుమారు 25 నిమిషాలు నిలిచిపోగా, మిగతా రైళ్లు సుమారు 45 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి.

జనగామలో నేటి నుంచి ప్రత్యేక వ్యాక్సినేషన్

జనగామ రూరల్, సెప్టెంబర్ 16:: జనగామ జిల్లాలో 18సంవత్సరాలు నిండిన వారందరికి గురువారం నుంచి వందశాతం వ్యాక్సినేషన్ కు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసినట్లు జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నేటి నుంచి జిల్లాలో ప్రజల వద్దకే వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లాలో 281 గ్రామాలు, 600 ఆవాసాలు ఉన్నాయని, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 104 సబ్ సెంటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 18సంవత్సరాల వయస్సు పైబడిన వారు 3లక్షల 89వేల 746 మంది ఉండగా, ఇందులో మొదటి డోస్ ఒక లక్షా 61వేల 913మంది, రెండవ డోస్ 48వేల 535మంది టీకాలు తీసుకున్నారని తెలిపారు.

జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 10వేల 448మందికి డోసులు ఇచ్చామన్నారు. జనాభా ప్రాతిపదికన 41-54 శాతం మందికి ఇప్పటి వరకు వ్యాక్సినేషన్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గురువారం నుంచి 104 సబ్ సెంటర్లు, హెడ్ క్వార్టర్స్?లో, జనగామ పట్టణంలోని 1 నుంచి 15వార్డు వరకు గల వార్డుల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ చేపట్టనున్నట్లు వివరించారు. ప్రతి మండలానికి, ప్రతి వ్యాక్సినేషన్ కేంద్రానికి ఒక ప్రత్యేక అధికారిని పర్యవేక్షణకు నియమించినట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో, డీఆర్డీవో, డీపీవో, సమన్వయ అధికారులుగా ఉంటారన్నారు. వ్యాక్సినేషన్ చేపట్టే గ్రామం, వార్డులలోముందస్తుగా తేదీని తెలుపుతూ టాం..టాం ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. వ్యాక్సినేషన్ తీసుకున్న తర్వాత కూడా కొవిడ్ వస్తే, ప్రాణహాని ఉండదని, త్వరగా కొలుకుంటారని ఆయన తెలిపారు.

ఈప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అందరూ భాగస్వామ్యం కావాలని, వందశాతం వ్యాక్సినేషన్ విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈవ్యాక్సినేషన్‌ను 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్, జడ్పీ సీఈవో ఎల్. విజయలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మహేందర్, డీఆర్‌డీవో గూడూరు రాంరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్ రాజు, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, సీపీవో ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ కౌంటింగ్ కు గ్రీన్ సిగ్నల్

అమరావతి, సెప్టెంబర్ 16:ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే గోస్వామి, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 8న జరిగిన ఎన్నికల ప్రక్రియను సమర్ధించిన ధర్మాసనం.. కౌంటింగ్ కు అనుమతిస్తూ తీర్పునిచ్చింది.

ఈ ఏడాది ఏప్రిల్ 1న ఎస్ఈసీ నీలం సాహ్ని ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏప్రిల్ 8న రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. అయితే, పరిషత్ ఎన్నికల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా ఉందని, సరైన కాలపరిమితి లేకుండా ఎన్నికలు నిర్వహించారంటూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జ్ ధర్మాసనం మే 21న న్నికలను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. పోలింగ్ తేదీకి నాలుగు వారాల ముందు ఎన్నికల కోడ్ విధించాలని.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా నోటిఫికేషన్ ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియ ఎక్కడైతే ఆగిందో అక్కడి నుంచి నిర్వహించేందుకు తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు కట్టుబడి పోలింగ్ తేదీకి నాలుగు వారాల ముందు తిరిగి ఎన్నికల కోడ్ విధించాలని స్పష్టం చేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తో పాటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు డివిజనల్ బెంచ్ లో అప్పీల్ చేశారు. . వాటిపై ఆగస్టు 5న విచారణ జరిపిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా ఓట్ల లెక్కింపునకు పచ్చజెండా ఊపుతూ తీర్పును వెల్లడించింది.

కాగా, ఈ ఏడాది మార్చిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన అప్పటి ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ తగిన సమయం లేదనందున పరిషత్ ఎన్నికలు నిర్వహించలేకపోయారు. ఈ క్రమంలో ఇటు ప్రభుత్వానికి, అటు ఎస్ఈసీకి మధ్య యుద్ధం నడిచింది. అనం

ఆర్టీసీ బస్సులో సాధారణ ప్రయాణికుడిలా సజ్జనార్

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:తెలంగాణ ప్రభుత్వ ఆర్టీసీ సంస్థ టీయస్ఆర్‌టిసి అని గట్టెక్కించేందుకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ రంగంలోకి దిగారు. సాధారణ ప్రయాణికుడిలా సిటీబస్సులో ప్రయాణించారు. లక్డీకాపూల్ నుంచి ఎంజీబీఎస్ వరకు బస్సులో వెళ్తూ ప్రయాణికులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎంజీబీఎస్‌లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులకు సజ్జనార్ పలు సూచనలు చేశారు. పాడైపోయిన వాహనాలను స్క్రాప్ యార్డుకు తరలించాలని ఆయన ఆదేశించారు. టీఎస్ఆర్టీసీ సంస్థ ఆదాయం పెంచేందుకు అందరూ కృషి చేయాలని సజ్జనార్ సూచించారు.

సత్వర సేవలందించేందుకు సివిల్ కోర్టుల ఏర్పాటు : జస్టిస్ రామచందర్ రావు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 16: : ప్రజలకు సత్వర న్యాయ సేవలందించేందుకే జూనియర్ సివిల్ కోర్టు లు ఏర్పాటుఅవుతున్నాయని హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి రామచందర్ రావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ లో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా ప్రొటోకాల్ జడ్జి రాజశేఖర్ రెడ్డి, హై కోర్ట్ న్యాయమూర్తులు రాజశేఖర్ రెడ్డి, షెమి మక్తాద్, వినోద్ లతో కలసి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. కక్షి దారులకు ఈ కోర్టు ఏర్పాటు వల్ల సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఇంటివద్దకే న్యాయ సేవాలందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్, ఏడీఎం నాగరాజు, చౌటుప్పల్ జూనియర్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి, డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ ఉదయ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు పాల్గొన్నారు.

ఛార్‌ధామ్ యాత్రపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:చార్‌ధామ్ యాత్రపై నిషేధాన్ని ఉత్తరాఖండ్ హైకోర్టు గురువారం ఎత్తివేసింది. అయితే దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యను పరిమితం చేయాలని సూచించింది. కొవిడ్-19 మహమ్మారిని దృష్టిలో ఉంచుకుని కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి ధామ్‌లను సందర్శించే భక్తులకు కరోనావైరస్ పాజిటివ్ రిపోర్టులు, రెండో డోసుల టీకా తీసుకున్న సర్టిఫికేట్‌ను తప్పనిసరి చేయాలని కోర్టు ఆదేశించింది. కరోనా మార్గదర్శకాలను పాటించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపింది.

చార్‌ధామ్‌ను సందర్శించేందుకు హై కోర్టు యాత్రికులను అనుమతించినప్పటికీ, ఆలయాలను సందర్శించే భక్తుల సంఖ్యపై రోజువారీగా పరిమితి విధించాలన్నది. కేదార్‌నాథ్ ఆలయంలో 800 మంది భక్తులు, బద్రీనాథ్ ఆలయంలో 1200 మంది, గంగోత్రిలో 600 మంది, యమునోత్రి ధామ్‌లో 400 మంది భక్తులను మాత్రమే అనుమతించాని హైకోర్టు తెలిపింది. గతంలో కరోనా థర్డ్‌వేవ్ ముప్పును దృష్టిలో పెట్టుకుని చార్‌ధామ్ యాత్రకు అనుమతించేందుకు హైకోర్టు నిరాకరించింది.

ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా

నిర్మల్, సెప్టెంబర్ 16: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల్లోని ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 61 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, ఎంసీ చైర్మన్ పుప్పాల శంకర్, వైస్ చైర్మన్ గొరె గంగాధర్, ఎంపీపీ అబ్దుల్ మొయీద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఇన్‌చార్జి తాసీల్దార్ ఫారూఖ్, ఆర్ఐ రాజేశ్వర్, టీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు సురేశ్, రాజగంగన్న, నాయకులు ప్రదీప్, గజేందర్, శంకర్, కిశోర్, మహేశ్, శేఖర్‌రెడ్డి, నర్సయ్య, లింగన్న, మల్లేశ్, విజయ్, రత్నం, పలు గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏఎస్యు&హెచ్ భద్రత, నాణ్యత విషయంలో ప్రపంచ సమాజానికి నమ్మకాన్ని పెంచేలా ఉమ్మడి సహకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:కీలకమైన ముందడుగులో భాగంగా, ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేద, ఇతర భారతీయ సాంప్రదాయ ఔషధ ఉత్పత్తుల నాణ్యతను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా అమెరికన్ మార్కెట్‌లో వాటి ఎగుమతి సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి మార్గం సుగమం చేసింది. ఫార్మాకోపోయియా కమిషన్ ఫర్ ఇండియన్ మెడిసిన్ ఉ హోమియోపతి (పిసిఐఎం ఉ హెచ్), అమెరికన్ హెర్బల్ ఫార్మాకోపోయియా, యుఎస్ఎ, 2021సెప్టెంబర్ 13న ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు) పై సంతకం చేయడం ద్వారా ఇది సాధించడం అయింది.

ఈ ఎంఒయుపై వర్చ్యువల్ గా సంతకాలు జరిగాయి. సమానత్వం మరియు పరస్పర ప్రాతిపదికన రెండు దేశాల మధ్య ఆయుర్వేదం మరియు ఇతర భారతీయ సాంప్రదాయ వైద్య వ్యవస్థల ప్రమాణాలను బలోపేతం చేయడం, ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం కోసం ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ ఎంఒయూ కుదుర్చుకుంది.

ఏఏస్యుఉహెచ్ (ఆయుర్వేదం, సిద్ధ, యునాని మరియు హోమియోపతి) ఔషధాల ఎగుమతి సామర్థ్యాన్ని పెంచడంలో ఈ ప్రయత్నాల సహకారం కోసం సుదీర్ఘ ప్రయాణం ఉంటుంది. ఈ ఎంవోయు కింద, సంప్రదాయ వైద్య రంగంలో సహకారం కోసం మోనోగ్రాఫ్‌లు మరియు ఇతర కార్యకలాపాల అభివృద్ధికి కాలక్రమాలతో పాటు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి ఒక ఉమ్మడి కమిటీ విధానం ఉంటుంది.

ఏఏస్యుఉహెచ్ ఔషధాల భద్రత గురించి ఈ ఎంఒయూ ప్రపంచ సమాజంలో విశ్వాసాన్ని పెంపొందిస్తుందని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఈ భాగస్వామ్యం ప్రధాన ఫలితాలలో ఒకటి పిసిఐఎండహెచ్, ఏహెచ్పి, రెండూ అమెరికాలో ఆయుర్వేద ఉత్పత్తులు/ఔషధాల హెర్బల్ మార్కెట్ ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గుర్తించడానికి పనిచేస్తుంది. అమెరికాలోని మూలికా ఔషధాల తయారీదారులు ఈ సహకారం నుండి అభివృద్ధి చేసిన ఆయుర్వేద ప్రమాణాలను స్వీకరించడానికి ఇది దారి తీస్తుంది. దీనిని ఒక పెద్ద ముందడుగుగా పేర్కొనవచ్చు మరియు చివరికి అమెరికాలో ఓఐ ఉ ఊ ఉత్పత్తులు/ఔషధాల మార్కెట్ అధికారం కోసం ఈ సహకారం నుండి అభివృద్ధి చేయబడిన ఆయుర్వేద ప్రమాణాలను స్వీకరించడాన్ని ప్రోత్సహిస్తుంది.

ఈ ఎంఒయు ద్వారా ఇద్దరు భాగస్వాములు ఆయుర్వేదం, ఇతర భారతీయ సాంప్రదాయ ఔషధ ఉత్పత్తుల నాణ్యత మరియు భద్రతకు భరోసా ఇచ్చే ప్రమాణాల గుర్తించడానికి ప్రయత్నిస్తారు. సాంప్రదాయ /మూలికా మందులు మరియు వాటి ఉత్పత్తుల నాణ్యతపై అవగాహన మరియు అవగాహన పెరుగుదలను నిర్ధారిస్తుంది.

ప్రతి ఒక్కరూ కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, సెప్టెంబర్ 16:: మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పాలకుర్తి నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరోనా మహమ్మారి నుండి తెలంగాణ ప్రజలను కాపాడటానికి ప్రతిరోజు మూడు లక్షల మందికి వ్యాక్సిన్ ఇచ్చే విధంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు అని తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా పూర్తి నియంత్రణ లో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం దృష్ట్యా భవిష్యత్తులో ఏ విధమైన ఇబ్బందులు ఏర్పడకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. రాష్ట్రంలో వ్యాక్సిన్ వేసుకునేందుకు 18 సంవత్సరాల పైబడిన వారు 2 కోట్ల 80 లక్షల మంది ఉన్నారు. ఇప్పటి వరకు 2 కోట్ల 17 వేలమందికి వాక్సిన్ ఇచ్చామన్నారు. వీరిలో ఒక కోటి 45 లక్షల మందికి మొదటి డోస్ వ్యాక్సినేషన్ పూర్తయింది. 55 లక్షల మందికి సెకండ్ డోసు వ్యాక్సినేషన్ పూర్తయింది అని మంత్రి పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో రూ.2 కోట్లతో పోలీస్ కంట్రోల్ రూమ్.. ఎమ్మెల్యే జోగు రామన్న భూమి పూజ

ఆదిలాబాద్, సెప్టెంబర్ 16: : తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో భారతదేశంలోనే కాకుండా ఆసియా ఖండంలోనే రూ.400కోట్లతో అధునాతనమైన టెక్నాలజీతో అతి పెద్దదైన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకుంటున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాస్ నగర్‌లో పట్టణ ప్రగతిలో భాగంగా రూ.2 కోట్లతో నిర్మిస్తున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇన్‌చార్జి ఎస్పీ రాజేశ్ చంద్రతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధునాతన టెక్నాలజీతో పోలీస్ వ్యవస్థను పటిష్టం చేయడంతో నేరాల శాతం తగ్గుముఖం పడుతోందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో సైతం మున్సిపల్ నిధులు రూ.2 కోట్లతో ఈ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసుకుంటున్నామని వివరించారు. దీనితోపాటు మరో రూ.20లక్షలతో భవన నిర్మాణం సైతం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నూతన కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో నిఘా వ్యవస్థ మరింత పటిష్టం కానుందన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ పట్టణంలో 130 సీసీ కెమెరాలు ఉండగా, మరో 420 సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు చేయవచ్చని తెలిపారు. కొవిడ్ వైరస్ బారినపడకుండా ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఫ్లోర్ లీడర్ సతీశ్, వార్డు కౌన్సిలర్ అర్చనరామ్ కుమార్, ఆయా వార్డు , టీఆర్ఎస్ నాయకులు , పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్, ఆర్ఎంఐ, మరియు ఆర్ఎంఐ ఇండియా 'శూన్య' కార్యక్రమాన్ని ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:30 కి పైగా ఇ-కామర్స్ సంస్థలు, ఓఈఎంలు, ఫ్లీట్ అగ్రిగేటర్లు, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు ఫైనల్-మైలు డెలివరీలను శుభ్రపరిచే కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించడంలో చేతులు కలుపుతాయి.

నీతి ఆయోగ్, ఆర్ఎంఐ మరియు ఆర్ఎంఐ ఇండియా మద్దతుతో వినియోగదారులు మరియు పరిశ్రమలతో కలిసి పనిచేయడం ద్వారా జీరో-పొల్యూషన్ డెలివరీ వాహనాలను ప్రోత్సహించే ఒక చొరవ అయిన శూన్యను నేడు ప్రారంభించింది. పట్టణ డెలివరీల విభాగంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవిలు) వినియోగాన్ని వేగవంతం చేయడం మరియు జీరో-పొల్యూషన్ డెలివరీ ప్రయోజనాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం.

ఇ-కామర్స్ కంపెనీలు, ఫ్లీట్ అగ్రిగేటర్లు, ఒరిజినల్ పరికరాల తయారీదారులు (ఓఈఎంలు) మరియు లాజిస్టిక్స్ కంపెనీలు వంటి పరిశ్రమ వాటాదారులు లాస్ట్ మైల్ డెలివరీ విద్యుదీకరణ దిశగా తమ ప్రయత్నాలను పెంచుతున్నారు. నీతి ఆయోగ్ కార్యక్రమానికి తమ మద్దతును తెలియజేయడానికి మహీంద్రా ఎలక్ట్రిక్, టాటా మోటార్స్, జొమాటో, అశోక్ లేలాండ్, సన్ మొబిలిటీ, లైట్నింగ్ లాజిస్టిక్స్, బిగ్ బాస్కెట్, బ్లూడార్ట్, హీరో ఎలక్ట్రిక్ మరియు స్విగ్గీతో సహా దాదాపు 30 కంపెనీలు సిఈఓ అమితాబ్ కాంత్ అధ్యక్షతన జరిగిన కిక్ ఆఫ్ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం ఈ ప్రయత్నంలో భాగస్వాములు కావడానికి ఇతర సంస్థలను ఆహ్వానిస్తారు.

కార్యక్రమంలో భాగంగా తుదిమైలు డెలివరీల కోసం ఈవీ పరిశ్రమ ప్రయత్నాలను గుర్తించి ప్రోత్సహించడానికి కార్పొరేట్ బ్రాండింగ్ మరియు ధృవీకరణ కార్యక్రమం ప్రారంభించబడింది. ఆన్‌లైన్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ కార్యక్రమ ప్రభావాన్ని వాహన కిలోమీటర్లు విద్యుదీకరించడం, కార్బన్ సేవింగ్స్, కాలుష్య కారకాలు మరియు క్లీన్ డెలివరీ వాహనాల నుండి ఇతర ప్రయోజనాలు వంటి డేటా ద్వారా పంచుకుంటుంది.

కార్యక్రమ ప్రాథమిక లక్ష్యాన్ని హైలైట్ చేస్తూ నీతి ఆయోగ్ సిఈఓ అమితాబ్ కాంత్ మాట్లాడారు. "విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా ఆరోగ్యం, పర్యావరణం మరియు ఆర్థిక ప్రయోజనాల గురించి అవగాహనను మేము శూన్య కార్యక్రమం ద్వారా ప్రచారం చేస్తాము. సరుకు రవాణా రంగం నుండి కాలుష్యాన్ని తొలగించే అవకాశాన్ని గుర్తించాలని ఇ-కామర్స్ కంపెనీలు, ఆటో తయారీదారులు మరియు లాజిస్టిక్స్ ఫ్లీట్ ఆపరేటర్లను నేను కోరుతున్నాను. మా డైనమిక్ ప్రైవేట్ రంగం శూన్యను గొప్ప విజయాన్ని సాధించే సవాలుగా ఎదుగుతుందని నాకు నమ్మకం ఉంది" అని తెలిపారు.

క్లీన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించాల్సిన తక్షణ అవసరం గురించి ఆర్ఎంఐ మేనేజింగ్ డైరెక్టర్ క్లే స్టేంజర్ మాట్లాడుతూ ''స్థిరమైన మరియు స్థితిస్థాపకమైన భవిష్యత్తు వైపు భారతదేశం ముందుకు సాగుతున్నందున పరిశుభ్రమైన రవాణాకు పరివర్తన చాలా కీలకం. పోటీతత్వకలిగిన ఆర్థికరంగం అందుబాటులో ఉన్న సాంకేతికత వేగవంతమైన టైమ్‌లైన్‌లో భారతదేశ అర్బన్ డెలివరీ ఫ్లీట్‌ల పూర్తి విద్యుదీకరణకు మద్దతు ఇస్తుంది. ఇది ఇతర మార్కెట్ విభాగాలు అనుసరించడానికి అవసరమైన మద్దతును సృష్టిస్తుంది.'' అని చెప్పారు.

భారతదేశంలో సరుకు రవాణా సంబంధిత సిఓ2 ఉద్గారాలలో పట్టణ సరుకు రవాణా వాహనాలు 10 శాతం ఉన్నాయి. 2030 నాటికి ఈ ఉద్గారాలు 114 శాతం పెరుగుతాయని భావిస్తున్నారు. ఈవిలు ఏ టెయిల్‌పైప్ ఉద్గారాలను విడుదల చేయవు. ఇది మెరుగైన వాయు నాణ్యతకు ఎంతో దోహదం చేస్తుంది. వాటి తయారీకి లెక్కలు వేసినప్పుడు కూడా అవి తమ అంతర్గత దహన ఇంజిన్ ప్రత్యర్థులతో పోలిస్తే 15-40 శాతం తక్కువ సిఓ2 ను విడుదల చేస్తాయి మరియు తక్కువ మెయింటెన్స్ వ్యయాన్ని కలిగి ఉంటాయి. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఈవిల కోసం ప్రోత్సాహకాలను అందించడానికి పాలసీలను ప్రవేశపెట్టాయి, ఇది మూలధన వ్యయాన్ని భారీగా తగ్గిస్తుంది.'' అని తెలిపారు.

ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఒక వారంలో 2614 ఎస్ హెచ్ జి వ్యవస్థాపకులకు (సిఈఎఫ్) రుణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూ. 8.60 కోట్ల విలువైన కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ ఫండ్ (సిఈఎఫ్) రుణాన్నివారం రోజుల్లో 2614 ఎస్ హెచ్ జి గ్రూపులకు అందించింది. స్టార్ట్-అప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ కింద 19 రాష్ట్రాలలోని వారి గ్రామాల్లో వారి మైక్రో ఎంటర్‌ప్రైజ్‌లను ప్రారంభించడానికి రుణాలు అందించారు. అమృత్ మహోత్సవం సందర్భంగా, స్టార్ట్-అప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం (ఎస్వీఈపి) కింద 6వ తేదీ నుండి 12 సెప్టెంబర్, 2021 వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఎస్వీఈపి పథకం గురించి అవగాహన కల్పించడం మరియు గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ వ్యాపారాలను ప్రారంభించాలనుకునే ఎస్ హెచ్ జి సభ్యులకు ఇది ఎలా మద్దతు ఇస్తుంది అనే అంశాలపై దృష్టి పెడతారు. ఈ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు పాల్గొన్నారు.

ఈ కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ ఫండ్ (సిఈఎఫ్) రుణాన్ని అందించడానికి ముందు, ఎస్ హెచ్ జి వ్యవస్థాపకులకు వ్యవస్థాపకతపై ప్రారంభ శిక్షణ ఇచ్చారు. వారి ప్రతిపాదిత వ్యాపారం వివరణాత్మక వ్యాపార ప్రణాళిక తయారు చేశారు.

ఈ చొరవలో పాల్గొన్న రాష్ట్రాలు - ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ మరియు పశ్చిమ బెంగాల్. ఈ కార్యక్రమాల సమయంలో, ఎస్ హెచ్ జి వ్యవస్థాపకులు తమ అనుభవాలను మరియు తమ గ్రామాల్లో తమ సొంత వ్యాపారాలను ప్రారంభించి, వ్యాపారవేత్తలు మరియు స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం (ఎస్వీఈపి) కింద అందుకున్న వివిధ మద్దతులను పంచుకున్నారు. వ్యాపారం చేయడానికి దశలను అర్థం చేసుకోవడానికి, దానిని విజయవంతం చేయడానికి, బలమైన మార్కెట్ అనుసంధానాలను ఏర్పరుచుకోడానికి రెగ్యులర్ హ్యాండ్‌హోల్డింగ్ బలాన్ని కూడా వారు నొక్కి చెప్పారు.

స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ (ఎస్వీఈపి) అనేది గ్రామీణ ప్రాంతాలలో వ్యాపారాలను ప్రోత్సహించడానికి ఎన్ఆర్ఎల్ఎం కింద ఒక ఉప పథకం.ఎస్వీఈపి బ్లాక్‌లో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ కోసం పర్యావరణ వ్యవస్థను ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్-ఎంటర్‌ప్రైజ్ ప్రమోషన్ (సిఆర్పి-ఈపి) క్యాడర్ ఉంటుంది, వారు వ్యాపారవేత్తలకు వ్యాపార మద్దతు సేవలను అందిస్తారు. ఈ పథకం వ్యాపార ఆలోచనలను గుర్తించడం, వ్యాపార ప్రణాళికల తయారీ, రుణాలు పొందడం మరియు మార్కెటింగ్, ఖాతాలను నిర్వహించడం, వ్యాపార నిర్ణయాలు తీసుకోవడం వంటి ఇతర మద్దతులను కలిగి ఉంటుంది. ఇంకా, పర్యావరణ వ్యవస్థలో పారిశ్రామికవేత్తల శిక్షణ, సామర్థ్యాన్ని పెంపొందించడం, ఎంటర్‌ప్రైజ్‌లను ప్రారంభించడానికి మూలధనం, ఉత్పత్తులు, సేవలకు మార్కెటింగ్ మద్దతు మొదలైనవి ఉన్నాయి, బ్లాక్ రిసోర్స్ సెంటర్ (బిఆర్సి), ఎంటర్‌ప్రైజ్ ప్రమోషన్ కోసం సింగిల్ పాయింట్ పరిష్కారం కూడా పర్యావరణ వ్యవస్థలో భాగంగా అభివృద్ధి చేశారు.

యూపీలో అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ : ఆప్

లక్నో, సెప్టెంబర్ 16:: వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే గృహ వినియోగదారులకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. యూపీలో విద్యుత్ చార్జీలు అధికంగా ఉన్నాయని, రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజే ఉచిత విద్యుత్ హామీని నెరవేరుస్తామని ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా వెల్లడించారు.

పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌తో కలిసి సిసోడియా గురువారం ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. యూపీలో పాలక బీజేపీకి తాము దీటైన పోటీ ఇస్తామని రాష్ట్రంలో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులు బరిలో ఉంటారని ఆప్ ఇప్పటికే వెల్లడించింది. యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వందమంది అభ్యర్థులతో కూడిన జాబితాను ఆప్ ప్రకటించిన మరుసటి రోజే ఉచిత విద్యుత్ హామీని ప్రకటించింది.

రాజు ఆత్మహత్య చేసుకుని ప్రభుత్వ వైఫల్యాన్ని గుర్తు చేశాడు: షర్మిల

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో చిన్నారి చైత్రను అత్యాచారం చేసిన నిందితుడు రాజు రైల్వేట్రాక్ వద్ద ఆత్మహత్య చేసుకున్న ఘటనపై వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల స్పందించారు. తాము బుధవారం చేసిన దీక్ష వల్లే మంత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారని ఆమె చెప్పుకొచ్చారు.

'సింగరేణి కాలనీలో 6 సంవత్సరాల పాపను అత్యాచారం చేసి దారుణంగా చంపేస్తే 6 రోజులైనా ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి ముఖం చెల్లని ఈ ప్రభుత్వ పెద్దలు.. మేము నిన్న చేసిన దీక్ష వల్ల దిగొచ్చి ఈ రోజు మంత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిన్న, మొన్న ఆ కుటుంబాన్ని కలవడానికి రాని మంత్రులు ఈరోజు నిందితుడు చనిపోయిన తరువాత ఆ కుటుంబాన్ని కలవడానికి పోటీ పడటానికి సిగ్గుండాలె. నిందితుడిని పట్టుకోవడంలో వైఫల్యానికి ఒక్క ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. రేపిస్ట్ ఆత్మహత్య చేసుకొని ప్రభుత్వ అసమర్థతను, కేసీఆర్ పాలనలో పోలీసులపై ప్రజలకులేని నమ్మకాన్ని వేలెత్తి చూపిస్తూనే ఉన్నాడు' అంటూ షర్మిల ట్వీట్లు చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ప్రజాప్రతినిధులు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామ లో గత నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బోనాగిరి సంపత్ కుటుంబాన్ని , ఆ గ్రామానికి చెందిన ఉ రిడి ప్రవీణ్,ఉ రిడి మెడికల్ రాజిరెడ్డి, పార్వతి రమేష్ ,తాడెం శ్రీనివాస్,ఉరిడి టీచర్ రవి,కట్ట సత్తయ్య,తిరుపతి, సబ్ స్టేషన్ మల్లారెడ్డి ,రవీందర్,చందు,కనకయ్య ,రాజు మదూరి రాజు ,రవి, లచ్చయ్య ,భరత్ మహేందర్ శ్రీను,చింతకుంట శ్రీనివాస్, రాజారామ్ నాగరాజు బాపురెడ్డి, బాలకృష్ణ,కృష్ణ, మహిపాల్ , డాక్టర్ రమేష్ దాతల సహకారంతో గురువారం రోజున సర్పంచ్ ఉ రిడి రాంరెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ ఉరిడి ప్రవీణ్,మాజీ సర్పంచ్ పార్వతి రామచంద్రం, తెరాస గ్రామశాఖ అధ్యక్షుడు నడిగొట హరికృష్ణ, నాయకులు పార్వతి భూమేష్ ,వంద రకాల రాజశేఖర్ కట్ట తిరుపతి అనుముల భరత్ ,ధావన్ పె ల్లి రవీందర్ తునికి నరేష్ బుర్ర నాగరాజు మాదురి రాజారాం మృతుడు సంపత్ ఇంటి వద్ద కు తరలి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించడమే కాకుండా 20, 000 ఆర్థిక సహాయం కూడా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ కుటుంబ సంపత్ కుటుంబ పరిస్థితి బాగా లేదని 20 వేల రూపాయల దాతల సహకారంతో ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. మరింత సహాయ సహకారాలు తప్పనిసరిగా అందజేస్తామని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం మృతుడు సంపత్ అతని భార్య ఆర్థిక సాయం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.


కావ్యగానం 52
అనగనగా కాలం
అనిశెట్టి రజిత
ముఖ్యఅతిథి:
శ్రీ మామిడి హరికృష్ణ
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ,
తెలంగాణ ప్రభుత్వం
ఆత్మీయ అతిథి:
డాక్టర్ కొమర్రాజు రామలక్ష్మి
రుద్రమ సాహిత్య సామాజిక అధ్యయన వేదిక
సమయం: 19.09.2021
ఆదివారం సా.5 గం.లకు

తెలుగన్న తెలగన్న

అచ్చ తెలుగు పద్యానికి నిర్వచనం చెప్తూ కేతన 'ఆంధ్ర భాషా భూషణం'లో ఈ విధంగా తెలియజేసాడు –

తలనెల వేసవి గుడిమడి
పులి చలి మడుగూరు పేరు బూరుగు మగవా
డలుకయని యెల్లవారికి
దెలిసెడి యా పలుకులచ్చతెనుగన బరగున్

పై పద్యంలో కేతన ప్రయోగించింది అన్నికూడా అందరికీ తెలిసిన అచ్చ తెలుగు మాటలు. తత్సమాన్ని వదిలేసి మిగిలినవాటికి ప్రాధాన్యతను ఇస్తూ తెలుగు పలుకుబడులను ప్రయోగం చేస్తాడు.

శివకవి యుగంలో జాను తెనుగుగా ప్రస్తావించబడిన ఈ తెలుగు దేశ్య పదాలను ప్రయోగంలోకి తీసుకొచ్చినప్పటికీ ఇంకా మరుగునబడిన అచ్చమైన గ్రామీణ వ్యవస్థలోని పదాలను తేలేకపోయింది. ఏ విధంగా చూసినా పొన్నెగంటి తెలగన 16వ శతాబ్దంలో రాసిన 'యయాతి చరిత్ర' తొలి తెలుగు కావ్యంగా పండిత పామరులను అలరించింది. అలాగే కూచిమంచి తిమ్మకవి విరచితమైన 'నీలాసుందరి పరిణయం' అచ్చ తెలుగు కావ్యం తెలంగాణలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. అచ్చ తెలుగు కావ్యంగా చెప్పబడుతున్న యయాతి చరిత్ర గోల్కొండ పాలకుడైన ఇబ్రహీం షా కాలంలో వెలుగు చూసింది. ఈ కవి ఇబ్రహీం షా రాజ్యంలో పొట్ల చెరువు ప్రాంతం (అదే ఈనాడు పటాన్‌చెరువుగా పిలవబడుతోంది) పాలకుడైన అమీన్ ఖాన్ సర్దార్ కోరిక మీద ఈ అచ్చ తెలుగు కావ్యాన్ని రాసి అంకితమిచ్చాడు. కావ్యంలో ఉండవలసిన అంశాలన్నీ ఇష్టదేవతా స్తుతి, కవి వంశ వర్ణన, కృతిపతి వంశవర్ణన, సుకవి స్తుతి, కుకవి నింద మొదలైనవన్నీ కూడా ప్రవేశపెట్టి ఈ కావ్యానికి అర్థ గౌరవాన్ని తీసుకొచ్చాడు తెలగన్న.

ఈ గ్రంథంలో తెలగన్న తన కృతిని అంకితం తీసుకున్న సర్దార్‌అమీన్ ఖాన్, ఆయన భార్య బడే బీబీ ల ఉత్తమ గుణాలను వంశ వర్ణనలో ప్రశంసించాడు.ప్రధానంగా ఈ కావ్యం వెలుగులోకి రావడానికి రెండు కారణాలు బలీయంగా చోటు చేసుకున్నాయి. (1) తెలగన్న నూతన ప్రయోగాశక్తి (2) అతని పోషకుడైన అమీన్ ఖాన్ ప్రోత్సాహంతో కూడిన కోరిక. ఈ రెండు కారణాల వల్ల యయాతి చరిత్ర తొలి అచ్చ తెలుగు కావ్యంగా సమోదైంది. నన్నయ్యకు పూర్వం తెలుగు పద్యాలు శాసనాల్లో కనిపిస్తున్నా అతడు తెలుగు సాహిత్యంలో ఆదికవిగా గౌరవం పొందినట్లే అచ్చ తెలుగు పద్యాలు తెలగన్న కంటే ముందు ఉన్నప్పటికీ స్పష్టంగా చెప్పాలంటే అచ్చతెలుగు కావ్యాలకు తెలగన్నే ఆదికవి. నన్నయ్యను తరువాతి కవులు అనుసరించినట్లే అచ్చతెలుగు కావ్యకర్తలు తెలగన్నను ఆదర్శంగా తీసుకొని అతడు పెట్టుకున్న నియమాలను అనుసరిస్తూ కావ్యాలు రాసారు. అచ్చ తెలుగు కావ్యం అంటే దృశ్యాలు, ప్రాకృత సమాలు, తద్భవ పదాలు ఉన్నభాష. ఈ విషయంలో అచ్చ తెలుగు కావ్యంలో పేర్లు, బిరుదులు (సంస్కృత పదాలుగా అంతకుముందు ఉన్నప్పటికీ) మార్చకుండా మిగిలినదంతయూ అచ్చ తెలుగులోనే తెలియజేస్తానని తన లక్ష్యాన్ని తెలియజేస్తూ తెలగన్న 'యయాతి చరిత్ర' ప్రథమాశ్వాసం 14వ పద్యంలో ఈ విధంగా తెలియజేసాడు.

"తెనుగునను మాఱువెల్లిడి
పెనచిన వినగూడ దనుచు బిరుదుల జేట్లన్
మును వేల్పుబాస వెంబడి
నునిచెదగా దనకుండయ్య యుల్లములందున్"

తెలగనార్యుడు పై పద్యంలో ఔచిత్యానికి లోపం లేకుండా బిరుదులు, నామాలు సంస్కృత భాషలో ఉన్నట్లే ఉంచి తెలియజేస్తాననే నియమాన్ని తెలియజేయడం, దానిని తరువాతి కవులైన కూచిమంచి తిమ్మకవి, తదితరులు అనుసరించడం జరిగింది. తెలగన్న తాను ప్రవేశపెట్టిన నియమాన్ని తన కావ్యంలో వృత్తాలపరంగా చంపకవాట, కందం ఇత్యాది పదాలు సంస్కృత సమములుగానే తెలియజేసాడు.

తన గ్రంథంలో ఇతనిని గురించిన సమాచారం తక్కువగా తెలియజేసాడు. అయితే వావిళ్ళవారి ప్రచురిత పుస్తకంలో మాత్రం అపస్తంభసూత్రుడుగా, నియోగి, బ్రాహ్మణుడిగా, భావనామాత్యుని పుత్రునిగా పేర్కొనడం జరిగింది. భారతంలో నన్నయ్య యయాతి చరిత్రను 82 గద్య పద్యాల్లో తెలియజేస్తే తెలగన్న 560 పద్య గద్యాల్లో తెలియజేసాడు. అయితే నన్నయ్య భారతంలోని యయాతి చరిత్రకు తెలన్న యయాతి చరిత్రకు ఎక్కువగా భేదాలు కనిపిస్తాయి. అయితే తెలగన్న నన్నయ్యనే ఎక్కువ భాగం అనుసరించినట్లుగా కూడా అవగతమవుతుంది. ఈ విషయాలన్నీ పరిశీలించినపుడు తెలగన్న స్వతంత్ర పద్ధతిని ఈ కావ్యం రచించినట్లు అవగతం అవుతుంది. కొత్తదనాన్ని తన అచ్చ తెలుగు ప్రబంధం యయాతి చరిత్రలో తెలగన్న తీసుకొచ్చాడు. ఎక్కువ భాగ ఈ ప్రబంధంలో శబ్దాలంకారాలను తెలగన్న ప్రయోగించాడు. వర్ణనల విషయంలో సందర్భశుద్ధిని పాటిస్తూ తెలియజేసాడు. శ్లేష చమత్కారాలు ఈ గ్రంథంలో అనేక సందర్భాల్లో చోటు చేసుకోవడం అనిపిస్తుంది. దానికి ఉదాహరణ ఈ సీస పద్యం –

"పలపలకై ప్రూనువడి రండ్లు చూపెడు
పుడుకజెట్లను వేడబోవనేల
మించు చూపుడునె నమ్మించి నిల్కడయేది
వినమొసంగెడు మబ్బు బొసరనేల,
యొలివోయి యీలేక యొకపూట వెట్టెడు
తామరచెలిపట్టి దడవనేల,
పొరలంగబడుచు దా దెరమఱుంగున నుండి
కసరెడు మున్నీట బొసగ నేల?

అని కవిపై పద్యంలో శ్లేషయుక్తమైన చమత్కారాన్ని పళ్లుడిపోయిన ముసలి వారిని సైతం ఊరింపజేసాడు. అలాగే తెలంగాణ ప్రాంతంలో వాడుకలో ఉన్న దీపారాధన చేసే కుంది కామాక్షిగా ప్రఖ్యాతమైన పదాన్ని ఈ విధంగా పద్యంలో తెలియజేసాడు.

"ఎలమిందు మ్మెదమ్రోత వాసెరవలై యింపొందు మత్తిల్లు కో
వెల నీకారుల కూకపాట లమర న్వేవేడ్కతో నాలిగా
డ్పుల పేరం గల పట్టువు ల్గఱప గోపు ల్పూపు లేదీవపా
త్రల కయ్యామని పూవుము త్తెపు పరుల్దాల్పంగ నిచ్చెం గడున్".
త్రల కయ్యామని పూవుము త్తెపు పరుల్దాల్పంగ నిచ్చెం గడున్".

పై పద్యంలో యయాతిని చూచి సిగ్గుపడుతున్న దేవయానిని వర్ణించాడు. ఈ కవికి అచ్చ తెనుగుపై గల అధికారం తెలపడానికి అతడు ప్రయోగించిన ఛందస్సులు గమనించదగినవి. ఎక్కువగా ఉత్పలమాల, చంపకమాల, శార్దుల, మత్తేభాలు, జాతులలో కందాలు, ఉపజాతులలో సీసము, తేటగీతి, ఆటవెలది మొదలైనవాటిని ప్రయోగించడమే కాక నాలుగు తరలలు, ఐదు మత్తకోకిలలు, రెండు మాలినులు, రెండు రగడలు, రెండు పంచచామరములు మొదలైన వాటితో పాటు తోదకము, ఉత్సాహ, సుగంధి, తోటకము మొదలైనవాటిని కూడా ప్రయోగించాడు. ఇతడు ప్రయోగించిన రగడలలో ఒకటి మధురగతి రగడ, రెండు ద్విరదతి రగడ. అలాగే అచ్చ తెలుగుపై ఈ కవికి ఉన్న అధికారం తెలియజేయడానికి ఇతడు ప్రయోగించిన త్రిప్రాసములు, ద్విప్రాసములు కావ్య కథనాన్ని సులభంగా నడిపించడానికి దోహదపడింది. సాధారణంగా తెలుగు కావ్యాలు శ్రీకారంతో ప్రారంభమవడమనే సంప్రదాయానికి ఆవలగా ఈ కవి 'సిరుల'తో అని ప్రారంభించాడు. ఈ కవి లోక వ్యవహారాల్లో కూడా దక్షత కలవాడవడం వల్ల అనేక సందర్భాలలో వీటినిప్రయోగించాడు. కొన్ని విశేష ప్రయోగాలను కూడా ఈ కవి చేసాడు.

తెలగన్న ప్రబంధంలో అష్టాదశ వర్ణనలను ప్రాధాన్యమిచ్చే విధంగా సూర్యాస్తమయ వర్ణను అచ్చ తెలుగు మాటలలో ఈ విధంగా తెలియజేసాడు.

"సరగ మి న్నునుకమ్మరి సంజకొలిమి
బెట్టుగా గాల్చి బంగారు చుట్టువాటు
పడనువెట్టంగ గొనిపోయి పట్టలేక
విడిచె నన బ్రొద్దు పడమటికడలి మునిగె".

పై పద్యంలో కమ్మరి నిప్పుల కొలిమిని బాగుగా మండించి బంగారం చుట్టను నిప్పులో వేసి కాల్చే ప్రయత్నంలో వేడి పట్టలేక విడిచి పెట్టినట్లు చీకటి పొద్దు పడమటి కడలి మునిగిపోయింది– అని చమత్కరించాడు. ఈ పద్యంలో శ్లేష చమత్కృతి పాఠక హృదయాలను రంజింప చేస్తుంది. అలాగే తెలంగాణలో ప్రఖ్యాతమైన పదాలను ఈ కవి ప్రయోగించాడు. ఉదాహరణకు మత్తిలి, జేజే, సంజెకొలిమి, సోకుడు, పెయ్య, తల్లె, బుగ్గ, ఇంగలము, జాగము, బల్లెడము, కచ్చరలు, తాళుట, మీదికి, పొక్కిటి, గుట్ట, గిన్నను, సోలిపడ్డ, వడసి, వెలది, నెగుళ్లు, బొదలించు, చెర్లు, పొద్దుమీది, తేజి, చేతొడవులు, నెరులు, ఆనక, సిగ్గుముడిసి, బలిమికి వంటి పదాలు ఈనాటికీ ప్రచారంలో ఉండడం విశేషం.

ఈ విషయాలను అవగం చేసుకున్నప్పుడు పొన్నెగంటి తెలగనమాత్యుని యయాతి చరిత్ర అచ్చతెలుగు కావ్యాలో ఆదికావ్యంగా తెలంగాణ పలుకుబడులు, ప్రయోగాలు మొదలైనవాటిని తాను జీవించి ఉన్నకాలంలో ప్రాచుర్యంలో ఉన్నవాటిని సందర్భశుద్ధితో ప్రయోగించి కావ్యానికి వన్నె తీసుకురావడమే కాకుండా తెలంగాణ అచ్చ తెలుగు కావ్యస్రష్టగా, తెలుగు సాహిత్యంలో శాశ్వతుడ య్యాడు.

–గన్న కిరణ్ కుమార్
సెల్ : 9849885268



మంగళవారం ముషీరాబాద్ డివిజన్ జవహర్‌నగర్‌లో 'దీపిక ఫ్రెండ్స్ అసొసియేషన్' 44వ వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్. చిత్రంలో ప్రధాన కార్యదర్శి ఎస్.టి. అశోక్, ఎస్.టి. ప్రేమ్, ఎస్.టి. సాయి, ఎస్.టి. రమేశ్ మరియు కార్యకర్తలు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఫార్మర్ చైర్మన్ అక్బర్ హుస్సేన్ కు మాతృవియోగం

–సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్..
మంత్రులు
ఎమ్మెల్యేలు..ఎమ్మెల్సీలు.. కార్పొరేషన్ల చైర్మన్లు..

కరీంనగర్ సెప్టెంబర్ 16:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ తొలి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఫార్మర్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ మాతృమూర్తి పుత్లీ బేగం (76) గురువారం ఉదయం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత 15 రోజులుగా నిమ్స్ ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. సీఎం కేసీఆర్.. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్ కుమార్ లు ఢిల్లీ పర్యటన లో ఉండగానే అక్బర్ హుస్సేన్ కు ఫోన్ చేసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమ్స్ డైరెక్టర్ కు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చూడాలని సీఎం పేషీ అధికారులను ఆదేశించారు. మరణ వార్త తెలిసిన వెంటనే రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి అక్బర్ హుస్సేన్ ను పరామర్శించి..నివాళులర్పించారు.

అక్బర్ హుస్సేన్ కు ఫోన్ చేసి రాజ్యసభ ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, జోగినిపల్లి సంతోష్ కుమార్, మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు సుంకే రవిశంకర్, ఒడితేల సతీశ్ కుమార్, డాక్టర్ సంజయ్ కుమార్, రసమయి బాల కిషన్, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఫారూఖ్ హుస్సేన్, నారదాసు లక్ష్మణ్ రావు, సుడా చైర్మన్ జివి.రామకృష్ణ రావు, ఎంఐఎం ఎమ్మెల్యే లు జాఫర్ హుస్సేన్ మీరాజ్, అహ్మద్ బలాల, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎండి. సలీం, మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమరొద్దీన్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతెశ్రీలత రెడ్డి, జడ్పి చైర్మన్ విజయ, కార్పొరేటర్లు, మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప హరి శంకర్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, చలమేడ లక్ష్మి నరసింహరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్లు సంతాపం వ్యక్తం చేసి..ప్రగాఢ సానుభూతి తెలిపారు. నగరానికి చెందిన టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, బీఎస్పీ, వామపక్ష పార్టీల నాయకులు పెద్ద ఎత్తున అక్బర్ హుస్సేన్ ఇంటికి తరలివచ్చి పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సాయంత్రం అసర్ నమాజ్ సవారన్ మస్జిద్ లో చదివించి అనంతరం జనాజా నమాజ్ చేసి సవారన్ ఖబ్రస్థాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకోవాలి

–మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేసుకోవాలని వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు అన్నారుతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం కోవిడ్ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గురువారంవేములవాడ తిప్పాపూర్ లోని ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి ని మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు , 6వ వార్డ్ కౌన్సిలర్ నీలం కళ్యాణి శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాధవి రాజు మాట్లాడుతూ వేములవాడ పట్టణ ప్రజలు కూడా వ్యాక్సినేషన్ పై ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా అందరూ వ్యాక్సిన్ వేసుకొని ఆరోగ్యవంతమైన పట్టణంగా మన వేములవాడ ను తీర్చి దిద్దుకోవాలని,ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ వేసుకున్న ప్రజలు కూడా నిర్లక్ష్యం చేయకుండా సెకండ్ డోస్ వ్యాక్సిన్ వేసుకోవాలని ఇట్టి వాక్సినేషన్ డ్రైవ్ నువినియోగించుకోవాలని కోరారు.అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో పట్టణ ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలనివారు అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేష్ రావు ,హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేతేశ్వరి కంకాలమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ రాంరెడ్డి చేయూత

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): రుద్రవరం గ్రామం లో మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కేతేశ్వర కంకాలమ్మ ఆలయం కొరకు సర్పంచ్ ఊరడి రాంరెడ్డి దంపతులు 5016/వేల పదహార్లు ఆలయ కమిటీకి అందజేశారు

.గ్రామ సర్పంచ్ ఉంది కేవలం ప్రజలకు సేవ చేయడమే ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం తోచిన సహాయంఅందిస్తామనినిరూపిస్తున్నారు.కంకాలమ్మ గుడి నిర్మాణానికి సహకారం అందించి తనలో భక్తి భావం కూడా ఉందని నిరూపించారు .ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఊరడి ప్రవీణ్,టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నడిగొట్ల హరికృష్ణ నాయకులు ద్యావనపెల్లి రవి, ఊరడి నర్సింహారెడ్డి, గుండెల్లి శ్రీనివాస్ అనుముల మల్లేశం, , మేదరి సంఘం అధ్యక్షులు బూరం శంకర్, మండల అధ్యక్షులు నగూరు రాజయ్య, సభ్యులు గట్టయ్య, మహేష్, శ్రీకాంత్, రమేష్, సమ్మయ్య, సతీష్ రాకేష్, తదితరులు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 16ఫ ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా చేరే విధంగా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట మాధవరావు సూచించారు. బీర్కూర్ మండలంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్నినిర్వహించారు. జిల్లాలోని ఉద్యోగులందరూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేయాలని తెలిపారు. స్త్రీశక్తి భవనంలో బతుకమ్మ చీరలు భద్రపరిచిన గిడ్డంగిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి ఒకటి ఏర్పాటు చేయాలన్న బృహత్ ప్రకృతి వనం పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

సోమేశ్వర్ గ్రామం నుంచి నిజామాబాద్ జిల్లా సరిహద్దు బీర్కూర్ మండలంలోని బరంగేడ్డి గ్రామం వరకు, బీర్కూర్ కమాన్ నుంచి మైలారం గ్రామ శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా మూడు వరుసలలో మొక్కలను నాటి పూర్తి చేయాలన్నారు.

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.5 OF 2021

Between:
Mr. N.Suresh and Others
.....Petitioners
And
Mr.K.Visweswara Rao and another
..Respondents

Mr. Kambala Visweswara Rao, S/o. Narayana Murthy Age: 22 years, Occ: Owner of Bike bearing No.TS 09FG 2818, H.No. 157/B, 7-1-277/428, S.R. Nagar Colony, Amberpet, Hyderabad.
...Respondents No.1

Whereas the above named Petitioners filed compensation petition against you and Bajaj Allianz General Insurance Company Ltd for a sum of Rs.12,00,000/- for the accident caused by your vehicle Bike bearing No.TS 09FG 2818 on 11-05-2020 at Marikal ps Limits. The above case is posted to **11-11-2021.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE Honble COURT)

C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18, Swaroop Nagar Uppal, Hyderabad
Ph: 9440431541

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.4 OF 2021

Between:
Mr. V. Lambadi Manemma and another
.....Petitioner
And
Mr.K.Visweswara Rao and another
..Respondents

Mr. Kambala Visweswara Rao, S/o. Narayana Murthy Age: 22 years, Occ: Owner of Bike bearing No.TS 09FG 2818, H.No. 157/B, 7-1-277/428, S.R. Nagar Colony, Amberpet, Hyderabad.
...Respondents No.1

Whereas the above named Petitioners filed compensation petition against you and Bajaj Allianz General Insurance Company Ltd for a sum of Rs.14,00,000/- for the accident caused by your vehicle Bike bearing No.TS 09FG 2818 on 11-05-2020 at Marikal ps Limits. The above case is posted to **11-11-2021.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE Honble COURT)

C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18, Swaroop Nagar Uppal, Hyderabad
Ph: 9440431541

వరల్ క్వాలిటీ సమ్మిట్ - 2021- వర్చువల్‌గా పాల్గొన్న ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖిం నిపుణులు

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:ఆసియాలో అగ్రగామిగా గుర్తింపు పొందిన ఆసియా ఇంక్ 500, ప్రపంచంలోనే అతి పెద్ద క్వాలిటీ అస్యూరెన్స్ (ఖిం) సమ్మిట్, 'వరల్డ్ క్వాలిటీ సమ్మిట్ (చిఖిం) – 2021' ను ఇటీవల వర్చువల్‌గా నిర్వహించింది.ఆరు విభిన్న దేశాల నుండి వక్తలు మరియు ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది హాజరైన ఈ సమ్మిట్ లో ఖిం సంబంధించిన ఆకర్షణీయమైన ముఖ్యోన్యాసాలతో జరిగి భారీ విజయాన్ని సాధించింది.చిఖిం –2021 కి క్వాలిటీ కియోస్క్ టెక్నాలజీస్, పిరమిడ్ కన్సల్టింగ్, పీపుల్ టెక్ గ్రూప్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, లింక్డ్‌ఇన్, గూగుల్ క్లౌడ్ లాంటి ప్రపంచ స్థాయి స్పాన్సర్‌లు మరియు మరియు తెలంగాణ ప్రభుత్వం వంటి భాగస్వాములు మద్దతు ఇస్తున్నారు.ఎయిర్‌మీట్‌లో హోస్ట్ చేసిన ఈ వర్చువల్ ఈవెంట్ భారతదేశంలోని హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న ఆసియా ఇంక్.

ఊరుఊరికో జమ్మి చెట్టు..

హైదరాబాద్ , సెప్టెంబర్ 16:తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతీ ఊరిలో, ప్రతీ గుడిలో నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మరో వినూత్న కార్యక్రమం తీసుకుంది. దసరా పండగ సందర్భంగా ఈ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్ ను అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి చేతుల మీదుగా రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ఆవిష్కరించారు.

వేదకాలం నుంచి అత్యంత ప్రతిష్ట కలిగిన చెట్టుగా, భక్తి పూర్వకంగా అందరూ పూజించుకునే జమ్మి చెట్లను తెలంగాణ రాష్ట్ర వృక్షంగా ప్రభుత్వం గుర్తించింది. అయితే అనేక కారణాలతో అంతరించిపోతున్న జమ్మి చెట్లను దాని విశిష్టత రీత్యా ప్రతీ ఊరిలో, ప్రతీ గుడిలో ఉండేలా .. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ తరపున ఊరు ఊరుకో జమ్మి చెట్టు– గుడిగుడికో జమ్మి చెట్టు నినాదాన్ని ఎంపీ సంతోష్ కుమార్ తీసుకున్నారు.

తెలంగాణలో దసరా నాడు జమ్మి చెట్టును పూజించడం ఆచారం. జమ్మి ఆకులను బంధుమిత్రులకు ఇచ్చిపుచ్చుకుని అందరికీ మంచి జరగాలని కోరుకోవటం కూడా ఆనవాయితీ. ఈ ప్రాధాన్యతల దృష్ట్యా రానున్న దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఊరుఊరుకో జమ్మిచెట్టు– గుడిగుడికో జమ్మి చెట్టు కార్యక్రమం మొదలవుతుందని బేగంపేటలో జరిగిన పోస్టర్ రిలీజ్ సందర్భంగా ఎం.పీ ప్రకటించారు. ఇప్పటికే ఇరవై వేలకు పైగా జమ్మి మొక్కలను సిద్ధం చేస్తున్నామని, అన్ని గ్రామాలు, గుడులకు వీటిని పంపిణీ చేస్తామన్నారు

9వ వార్డు టిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షునిగా షేక్ గౌస్ పాషా

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని 9 వ వార్డు టిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షునిగా అవార్డు చెందిన షేక్ గౌస్ పాషా(ఆర్టిస్టు) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని వేములవాడ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజుఅందజేశారు. నూతనంగా ఎన్నికైన అవార్డు మైనార్టీ అధ్యక్షుడు గౌస్ పాషా మాట్లాడుతూ నాపై నమ్మకంతో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా పార్టీ అధిష్టానం సూచనల పాటిస్తూ ఆ వార్డు కౌన్సిలర్ రామతీర్థపు మాధవి రాజు ఆధ్వర్యంలోకమిటీ సభ్యులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు తననుఎన్నుకున్నందుకు టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు,కౌన్సిలర్ రామతీర్థపు మాధవి, సెస్ మాజీ డైరెక్టర్ రామతీర్థ పు రాజు ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహ్మద్ ,కోప్షన్ మెంబర్ సర్వర్ బాబున్,మైనార్టీ నాయకుడు ఎం.ఏ ర హిల్, సయ్యద్ బాబా కు కృతజ్ఞతలుతెలిపారు.

స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద 3ఈ సూత్రాలను అమలు చేస్తున్న ఈటీఓ

హైదరాబాద్ , సెప్టెంబర్ 16: విద్యుత్ వాహనాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. భారతదేశపు నెంబర్ 1 ఈమాస్ (ఎలక్ట్రిక్ మొబిలిటీ యాజ్ ఏ సర్వీస్) కంపెనీగా నిలకడతో కూడిన స్వచ్ఛమైన రవాణా సేవలపై పూర్తిగా దృష్టి సారించి సమగ్రమైన రవాణా సేవలను అందిస్తుంది. ఈటీఓ మోటర్స్ తమ 3ఈ ప్రాథమిక సూత్రాలైనటువంటి పర్యావరణం, ఉపాధి, సాధికారితపై కృషి చేస్తుంది. గుజరాత్‌లోని కేవాడియా వద్ద విద్యుత్ మూడు చక్రాల ప్రయాణీకుల వాహనాలు ట్రైలక్స్‌ను పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన ఒకే ఒక్క కంపెనీ ఈటీఓ. ఇక్కడ 100 మందికి పైగా స్థానిక నిరుద్యోగ మహిళలకు విద్యుత్ మూడు చక్రాల వాహనాలను నడుపడంలో శిక్షణ అందించారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు గుజరాత్‌లోని కేవాడియాను దేశంలో మొట్టమొదటి, వాస్తవిక ఈవీ జోన్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయన ఈ నగరానికి అక్టోబర్ 31న రావడంతో పాటుగా నేషనల్ యూనిటీ డేను లాంఛనంగా ఇక్కడ విద్యుత్ బస్సులు, కార్లు,రిక్షాలను ప్రారంభించడం ద్వారా వేడుక చేయనున్నారు.

శక్తి, అభివృద్ధి, సంపదకు ప్రతీక గులాబీ అని మహిళా పైలెట్లను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ మరియు నర్మద బీజేపీ అధ్యక్షులు ఘనశ్యామ్ పటేల్ అన్నారు. స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్దకు యాత్రికులను తీసుకువెళ్లి, తీసుకువస్తున్న మహిళలను ఉద్దేశించి వీరు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే రీతిలో కేంద్ర మహిళ, శిశు సంక్షేమాభివృద్ధి శాఖామాత్యులు స్మృతి జుబిన్ సైతం తన కేవాడియా సందర్శనలో మహిళలను అభినందించారు. ఈటీఓ మోటర్స్ ప్రారంభించిన ఈ కార్యక్రమం, వాస్తవిక పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థ దిశగా దేశం పయణించడానికి ప్రతీకగా

వినా